క్లుప్తంగా

పేద రైతుకు ఆర్థిక సాయం



కొలుట్లయ్య కుటుంబానికి సాయం అందిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, సుధాకరరావు

కర్నూలు(సెంట్రల్): గోనెగొండ్లకు చెందిన బోయ కొలుట్లయ్య అనే రైతు కాడెద్దులు లేకపోవడంతో తన ఇద్దరు మనువళ్లతో సేద్యం చేస్తున్న వీడియో జూన్ 21వ తేదీ నుంచి సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. కర్నూలుకు చెందిన సుశీల నేత్రాలయ ఆస్పత్రి కంటి వైద్యుడు డాక్టర్ సుధాకరరావు ఆ వీడియోను చూసి చలించిపోయారు. బాధిత రైతును ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. కాడెద్దులు కొనుగోలు చేసేందుకు రూ.2 లక్షలు సాయం చేయాలని నిర్ణయించాడు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషా చేతుల మీదుగా సాయాన్ని రైతు బోయ కొలుట్లయ్యకు అందించడంతో ఆయన సంతోషంతో కృతజ్ఞతలు తెలిపారు.

దోమకాటుతో ప్రాణాంతక వ్యాధులు



అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు

కర్నూలు(హాస్పిటల్): దోమకాటు ద్వారా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోధకాలు, జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వంటి ఐదు ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని జిల్లా మలేరియా అధికారి నూకరాజు చెప్పారు. ఆయన శుక్రవారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలోని బోయగేరిలో నిర్వహిస్తున్న ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దోమకాటు వల్ల వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణ, చికిత్సల గురించి వివరించారు. దోమల లార్వాలు కనిపించకుండా ప్రజల భాగస్వామ్యం పెరగాలన్నారు. వైద్యులు మంజూష, ఆరోగ్య విస్తరణాధికారి మక్బుల్, సామాజిక అధికారి నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి కృషి చేస్తా



కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని నగరపాలక సంస్థ నూతన కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని, రహదారుల విస్తరణ, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, అన్యాక్రాంతమైన పార్కు స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనకు అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ నితీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు తదితరులు అభినందనలు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజును కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిశారు.


ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న బాలునాయక్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.బాలునాయక్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం యూనియన్ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆసుపత్రిలో పారామెడికల్, ఓటీ అసిస్టెంట్, ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓలు తక్కువగా ఉండటంతో ఉన్న వారిపై అధిక భారం పడుతోందన్నారు. ఒక్కొక్కరు మూడు, నాలుగు వార్డులకు పనిచేయాల్సి వస్తోందన్నారు. పనిభారంతో అనారోగ్యానికి గురవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో సెక్రటరీ ఖాజుముద్దీన్, సురేష్, హరిచంద్రనాయుడు, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నా



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (టౌన్): కర్నూలు నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం స్థానిక 45వ వార్డు పరిధిలోని శ్రీనగర్ కాలనీ, అశోక్ నగర్ కాలనీలలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.75.70 లక్షలతో నిర్మించనున్న మురుగు నీటి కాల్వలు, రోడ్ల ఎత్తు పెంచే పనులకు మంత్రి భూమిపూజ శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

నిరక్షరాస్యత నిర్మూలనకు చర్యలు



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): అక్షరాంధ్ర ద్వారా నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటామని జేసీ డాక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అక్షరాంధ్రపై వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ.. 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో నూరు శాతం అక్షరాస్యతను సాధించేందుకు అక్షరాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసు ఉన్న 1,61,914 మంది నిరక్షరాస్యులను అభ్యాసకులుగా తయారు చేసేందుకు చర్యలు తీసుంటున్నట్లు చెప్పారు. డీఆర్‌డీఏ, మెప్మా, ఉపాధి హామీ శాఖలు వారి పరిధిలోని నిరక్షరాస్యులను గుర్తించి వలంటీర్ ద్వారా 10 మందిని అక్షరాస్యులుగా తయారు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ఆగస్టు 1 నుంచి వచ్చే మార్చి వరకు కొనసాగుతుందని, రోజుకు 2 గంటల పాటు నిరక్షరాస్యులచే అక్షరాభ్యాసం చేయించాలని సూచించారు. కర్నూలు జిల్లాలో 5,75,296 మంది నిరక్షరాస్యులను రాబోయే మూడేళ్లలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సి ఉందన్నారు. వయోజన విద్య డీడీ కె.చంద్రశేఖరరెడ్డి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, మెప్మా పీడీ నాగశివలీల, డ్వామా పీడీ వెంకటరమణయ్య, డీపీఓ భాస్కర్, ఐసీడీఎస్ పీడీ నిర్మల, డిప్యూటీ డీఈఓ రాజేంద్రప్రసాదు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలపై పర్యవేక్షణ ఉంచాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఆకస్మిక తనిఖీ చేసి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని సమీక్షించి నివేదికలను సమర్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ ప్రోగ్రాం అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె తన చాంబర్‌లో ప్రోగ్రాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మెడికల్ ఆఫీసర్ హెల్త్ యాప్, ఎంఎల్‌హెచ్‌పీ యాప్, ఏఎన్ఎం హెల్త్ యాప్‌లో పొందుపరిచిన ఆరోగ్య సేవల వివరాలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చి సహాయక పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రోగ్రాం అధికారులు వారి పరిధిలోని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ ద్వారా ప్రతి ఒక్కరూ విధులకు హాజరయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. వైద్యాధికారులు వారి పరిధిలోని హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు తగిన ఆరోగ్య సేవలు అందించేలా చూడాలన్నారు. అసంక్రమిత వ్యాధుల సర్వే (ఎన్‌సీడీ 3.ఓ) త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, అందులో గుర్తించిన వారికి చికిత్సలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో డీఎల్ఏటీఓ డాక్టర్ భాస్కర్, డీపీఎంఓ డాక్టర్ ఉమ, డీఐవో డాక్టర్ నాగప్రసాద్‌బాబు, సంచార చికిత్స నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక గర్భనిరోధక పద్ధతులపై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): గ్రామాలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తాత్కాలిక గర్భనిరోధక పద్ధతులు (కండోమ్, గర్భనిరోధక మాత్రలు, మధ్యంతర ఐయూడీ, ప్రసవానంతర ఐయూడీ, అంతర ఇంజెక్షన్)ల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కర్నూలు (హాస్పిటల్): హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో బాధపడుతున్న చిన్నారులకు నేస్తం జిల్లా స్థాయి పాజిటివ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. స్థానిక బుధవారపేటలోని ఆ సంస్థ కార్యాలయంలో చైతన్య కళాభారతి స్వచ్ఛంద సంస్థ (నంద్యాల) ప్రెసిడెంట్ వి.విజయ భాస్కర్, జి.వరలక్ష్మి సహకారంతో 14 మంది చిన్నారులకు మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా వి.విజయభాస్కర్ మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా హెచ్ఐవీతో జీవిస్తున్న పిల్లల చదువు కోసం ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. వారు ఏఆర్‌టీ సెంటర్‌లో ఇచ్చే మందులు వాడి తమ జీవిత కాలాన్ని పెంచుకోవాలని సూచించారు. ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.ఉదయిని, నేస్తం ప్రెసిడెంట్ బి.సుధారాణి, డాక్టర్ ఎం.సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

14న విద్యుత్ సౌధ ముట్టడికి పిలుపు

కర్నూలు(సెంట్రల్): స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జూలై 14న విద్యుత సౌధను ముట్టడించనున్నట్లు జిల్లా కార్యవర్గ సభ్యులు టి.రాముడు, సుధాకరప్ప పేర్కొన్నారు. శుక్రవారం స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా కల్లూరు, వీకర్ సెక్షన్ కాలనీ, కవాడీ వీధి, చాకలి గేరి, కడక్‌పురాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల సొమ్మును అదానీకి దోచిపెట్టడానికే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని విమర్శించారు. టీడీపీ నాయకులు అధికారంలోకి లేని సమయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి.. అధికారంలోకి రాగానే ఒప్పుకోవడం అన్యాయమన్నారు. మంత్రి లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని చెప్పి.. ఇప్పుడు నోరు మెదకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఎం.భాస్కర్, లాల్ మహ్మద్ పాల్గొన్నారు.

13న స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక కిసాన్ ఘాట్ వద్ద ఉన్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఈత కొలనులో ఈ నెల 13వ తేదీ ఉదయం 9.30 గంటలకు సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో ఈత పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.రామకృష్ణయాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ వెంట స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన గుర్తింపు కార్డు జిరాక్స్ తీసుకురావాలన్నారు. ప్రతిభ చాటిన స్విమ్మర్లు ఈ నెల 19, 20 తేదీల్లో విశాఖపట్నం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే 10 వ అంతర్ జిల్లా సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల ఈత పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

అధిక జనాభాతో స్థిరత్వం కోల్పోతాం



మాట్లాడుతున్న రాయపాటి శ్రీనివాస్

కర్నూలు(హాస్పిటల్): అధిక జనాభా వల్ల విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో స్థిరత్వం కోల్పోతామని ఎన్‌హెచ్ఆర్‌సీజేఈ నేషనల్ జనరల్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్ చెప్పారు. నేషనల్ హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక బంగారుపేటలోని మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 1990 నుంచి ఐక్యరాజ్యసమితి సూచన మేరకు ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలనే ఉద్దేశంతో జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అధిక జనాభా వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితి దిగజారడంతో పాటు పర్యావరణ సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉందన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు మురారి శంకరప్ప, అంగన్‌వాడీ టీచర్లు మీనాక్షి, ఆనందమ్మ, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతాలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూఈఓ బి.రాధిక

కర్నూలు(అర్బన్): ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు పోస్టల్ ఖాతాలను ఓపెన్ చేయించడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిణి బి.రాధిక సూచించారు. పోస్టల్ ఖాతాలు ఓపెన్ చేయించి వాటికి ఎన్‌పీసీఏ లింకు చేయిస్తేనే తల్లికి వందనం డబ్బులు విద్యార్థుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో కర్నూలు, ఓర్వకల్ మండలాలకు చెందిన వసతి గృహ సంక్షేమాధికారులు, గ్రామ/వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం చదివే ఎస్సీ విద్యార్థులకు ఖాతాలను ఓపెన్ చేయించేందుకు వీలుగా హెచ్‌డబ్ల్యూఓ, వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రూపులుగా ఏర్పడి తమ బాధ్యతలను నిర్వహించాలన్నారు. ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లను స్వయంగా కలిసి పరిస్థితిని వివరించి పోస్టల్ అధికారులను సంప్రదించి ఖాతాలను ఓపెన్ చేయించాలన్నారు. సహాయ సంక్షేమాధికారులు బీ.మద్దిలేటి, కే.బాబు, జీ.సుంకన్న, అలీబాషా, హెచ్‌డబ్ల్యూఓలు డీసీ మదారి, డీపీ సులోచన, బీ.బెన్నమ్మ, బీ.రజనమ్మ, కే.ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శనివారం కర్నూలు నగరవ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.నగర ప్రజలు సహకరించాలని కోరారు.

బీసీ బాలికల వసతి గృహం తనిఖీ

– సోషల్ మీడియా కథనంపై కలెక్టర్ ఆరా

కర్నూలు(అర్బన్): బీసీ హాస్టల్‌లో భోజన సదుపాయాలతో పాటు హాస్టల్ పరిస్థితులు బాలేవని, తమకు టీసీలు ఇచ్చేయాలని బి.క్యాంప్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినీలు హెచ్ఎంకు మొరపెట్టుకున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంపై జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా స్పందించారు. వెంటనే హాస్టల్‌ను తనిఖీ చేసి నివేదిక అందించాలని జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారిణిని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం సాయంత్రం డీబీసీడబ్ల్యూఈఓ కె.ప్రసూన హాస్టల్‌కు వెళ్లి పరిస్థితులను తెలుసుకున్నారు. రెండు రోజుల క్రితం హాస్టల్‌కు వచ్చిన విద్యార్థినీలు ఇంటి మీద బెంగ పెట్టుకున్నట్లు సహచర విద్యార్థినీలు చెప్పారన్నారు. ఈ నేపథ్యంలోనే బాలికలు తమ ఊరికి వెళ్లినట్లు విచారణలో తేలిందన్నారు. మెనూ కచ్చితంగా పాటించాలని వసతి గృహ సంక్షేమాధికారిణులు శారదమ్మ, వెంకట ప్రమీలను ఆమె ఆదేశించారు.

శిశు గృహ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

కర్నూలు(సెంట్రల్): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహంలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులకు శుక్రవారం జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించింది. డీఆర్వో కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు సోషల్ వర్కర్ కం ఈసీఈ పోస్టుకు ఇద్దరు, జువైనల్ జస్టిస్ బోర్డులో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కం డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు 16 మంది, పోషణ్ అభియాన్ పథకంలో ఖాళీగా ఉన్న జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుకు నలుగురు అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కలెక్టర్‌కు బదులుగా డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ నిర్మల పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

కర్నూలు: గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు కర్నూలు రైల్వే స్టేషన్‌లో ఈగల్ టీమ్, జీఆర్‌పీ, స్థానిక పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కాచిగూడ నుంచి కర్నూలు మీదుగా గుంటూరుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్‌పై సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1972కు, స్థానిక పోలీసులకు డయల్ 112కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసు అధికారులు తనిఖీ సందర్భంగా తెలిపారు. ఈగల్ టీమ్ ఎస్ఐ సుజన్‌కుమార్, టూటౌన్ ఎస్ఐ సతీష్‌కుమార్ యాదవ్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు తనిఖీల్లో పాల్గొన్నారు.

రేపు హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం

కర్నూలు కల్చరల్: కర్నూలు ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఈ నెల 13వ తేదీన హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రమణ్యం తెలిపారు. ఈ సమ్మేళనానికి ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పూజ్యస్వామీజీలు, హిందూ ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగే సమ్మేళనానికి వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి ప్రధాన వక్తగా, వీర బ్రహ్మేంద్ర స్వామి 8వ తరం మునిమనవడు నొస్సం వీరంభట్లయ్య స్వామి వారిచే ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందని వెల్లడించారు.

డ్రైవర్ల సంఘం నిధులు దుర్వినియోగం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా వై.నాగేశ్వరరావు రూ.60 లక్షలు దుర్వినియోగం చేశారని, పదవీ కాలం ముగిసినా అధ్యక్షుడిగా కొనసాగుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు ఆరోపించారు. ఆయన శుక్రవారం సి.క్యాంపు సెంటరులోని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావుతో ముఖాముఖి చర్చించారు. అనంతరం ఆయన అక్రమాలపై పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2017 జూలై నుంచి 2025 జూన్ 10వ తేదీ వరకు సంఘం ఖాతాలో కేవలం రూ.17 లక్షలు జమ కాగా ప్రస్తుతం ఖాతాలో రూ.49,977 మాత్రమే ఉందన్నారు. సంఘానికి చెందిన భవనంలో 14 షాపులు ఉండగా ఒక్క షాపు బాడుగ మాత్రమే సంఘం ఖాతాలో జమ అవుతుందని మిగతాది ఎక్కడికి పోతుందో తెలియడం లేదన్నారు. ఫంక్షన్ హాల్ ఆదాయం, సంఘం సభ్యత్వం రుసుము ఒక్క రూపాయి కూడా ఖాతా జమ కాలేదని వివరించారు. చట్టవిరుద్ధంగా అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ రికార్డులు స్వాధీనం చేయని నాగేశ్వరరావుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వాలి

కర్నూలు(సెంట్రల్): నందవరం మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన డీఆర్వో సి.వెంకట నారాయణమ్మను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అలాగే ఎమ్మిగనూరులోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అడ్డుకోవాలని కోరారు.

26, 27 తేదీల్లో ఎస్ఎఫ్ఐ మహాసభలు

కర్నూలు(సెంట్రల్): ఎస్ఎఫ్ఐ 45వ మహాసభలను జూలై 26, 27 తేదీల్లో ఎమ్మిగనూరులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా తెలిపారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. శాస్త్రీయ విద్యా విధానానికి ఎస్ఎఫ్ఐ పాటుపడుతోందన్నారు. ప్రస్తుతం విద్య పేదవాడికి అందని ద్రాక్షగా మారిందన్నారు. వ్యాపారంగా మారిపోవడంతో మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈవిధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ పోరాటాలు చేస్తుందని వివరించారు. నాయకులు అమర్, ప్రకాశ్, విశ్వ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన



మాట్లాడుతున్న జడ్జి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(సెంట్రల్): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అన్ని కోర్టుల్లో ప్రవేశపెట్టనున్న మధ్యవర్తిత్వంపై శుక్రవారం బార్ అసోసియేషన్ న్యాయవాదులకు అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మధ్యవర్తిత్వం ద్వారా కేసులను ఎలా పరిష్కరించాలో వివరించారు. ఈ నెల 16న మధ్యవర్తిత్వంపై ప్రజలు, న్యాయవాదులకు అవగాహన సదస్సులను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్‌చౌదరి, సెక్రటరీ వెంకటేశ్వర్లు, హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు రవి గువేరా పాల్గొన్నారు.

వన్ కే రన్ నిర్వహణ: మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కోసం శుక్రవారం వన్ కే రన్‌ను నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి కొండారెడ్డి బురుజు వరకు కొనసాగిన వన్ కే రన్‌ను జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ చౌదరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ చౌదరి జెండా ఊపి ప్రారంభించారు. న్యాయవాదులు నాగేషయ్య, యూవీ లక్ష్మీ, ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీహరి పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్‌పై ఫిర్యాదు

కర్నూలు (సిటీ): ఆర్టీసీ డ్రైవర్‌పై ఓ మహిళా ఉపాధ్యాయురాలు శుక్రవారం జిల్లా ప్రజా రవాణా రీజనల్ మేనేజర్ టి.శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. తాను గోనెగండ్ల మండలం ఎస్.లింగందిన్నె స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం కర్నూలు నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సులో కోడుమూరు వెళ్లి.. అక్కడ పత్తికొండ ఆర్డినరీ బస్సు ఎక్కి లింగందిన్నె స్టేజీకి టిక్కెట్ తీసుకుంటానని చెప్పారు. స్టేజీ వచ్చాక బస్సు నిలపాలని కోరడంతో.. ఏంటి మేడం రెండు కిలోమీటర్లు కూడా లేదు, ఇదింత ఆటోకు రావచ్చు కదా? రోజూ ఇలా సతాయిస్తారేంటని డ్రైవర్ ప్రయాణికుల ముందు అవమానించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే తనను చూసి బస్సు ఆపకుండా వెళుతున్నారని, స్టేజీ కంటే ముందు గానీ లేకుంటే స్టేజీ దాటి 200 మీటర్ల దూరం వెళ్లాక బస్సును నిలుపుతున్నారని వాపోయారు. తనను అవమానించిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదుపై విచారించి చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు చెప్పారు.

జేవీవీ రాష్ట్ర సదస్సుకు జిల్లా కళాకారులు

కర్నూలు కల్చరల్: వైఎస్సార్ జిల్లా కేంద్రంలో శని, ఆదివారాల్లో నిర్వహించనున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సదస్సుకు జిల్లా కళాకారులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రం వద్ద కళాకారుల వాహనానికి కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ సలహాదారుడు ఎస్.మహమ్మద్ మియ్యా సాహితీ వేత్త చంద్రశేఖర కల్కూర, నరసం కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి, కళాక్షేత్రం సభ్యులు కేవీ రమణ, జేవీవీ సభ్యులు మీరేష్, బద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్‌లో అదనపు బాధ్యతల కేటాయింపు



ఈఈ బి.విజయరాజును అభినందిస్తున్న డీఈఈలు

కర్నూలు సిటీ: జల వనరుల శాఖలో ఖాళీగా ఉన్న స్థానాల్లో ఆ శాఖలో పనిచేస్తున్న ఇంజినీర్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. వారు శుక్రవారం ఆయా డివిజన్లలో బాధ్యతలు స్వీకరించారు. నాణ్యత నియంత్రణ విభాగంలో డీఈఈగా పని చేస్తున్న బి.విజయరాజు శ్రీశైలం వరద రక్షణ విభాగం ఈఈగా అదనపు బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆ విభాగంలో పనిచేస్తున్న డీఈఈలు, ఏఈఈ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తరువాత ఇంజినీర్లతో విజయరాజు సమావేశం నిర్వహించి, డివిజన్ పరిధిలో జరుగుతున్న పనులు, ఏవేవి తమ పరిధిలోకి వస్తాయో అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా సుజల ప్రవంతి పథకం ద్వారా 68 చెరువులకు నీటిని అందించే పనులు చివరి దశలో ఉన్నాయని, కాల్వకు నీరొచ్చిన తరువాత చెరవులకు పంపింగ్ చేసేందుకు సిద్ధమైనట్లు ఇంజినీర్లు వివరించారు. కర్నూలు నగరానికి గతంలో వచ్చిన వరదల సమయంలో నిర్మించాల్సిన రక్షణ గోడ, హంద్రీనది ఆక్రమణలు, సుద్దవాగు, వక్కెరవాగుల రక్షణ కోసం చేపట్టనున్న పనుల గురించి సమావేశంలో చర్చించారు. డీఈఈలు రామకృష్ణ, విజయ్‌కుమార్, శ్రీనివాస నాయక్, తదితరులు పాల్గొన్నారు.

– హంద్రీనీవా సుజల ప్రవంతి పథకం డివిజన్–2 ఈఈగా అనంతపురం హెచ్చెల్సీ బత్తులపల్లిలో డీఈఈగా పని చేస్తున్న ఎస్.ప్రసాద్‌రావుకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

శాకంబరీగా కన్యకా పరమేశ్వరి



శాకంబరీ అలంకారంలో కన్యకా పరమేశ్వరీ



సామూహిక కుంకుమార్చనలో మహిళలు

కర్నూలు కల్చరల్: ఆషాఢ మాసం శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఓల్డ్‌సిటీ పూలబజార్‌లోని చిన్న అమ్మవారి శాలలో కన్యకా పరమేశ్వరీ మాతకు, లలితా పీఠంలోని లలితా త్రిపుర దేవికి, సూర్యనారాయణ స్వామి ఆలయంలో మహాగౌరీ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. చిన్న అమ్మవారి శాలలో కన్యకా పరమేశ్వరీ మాతకు వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

గర్భధారణల మధ్య అంతరం ఉండాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): గర్భధారణల మధ్య అంతరం అవసరమని, అప్పుడే మహిళలు, వారికి పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో ప్రపంచ జనాభా దినోత్సవం, బాల్య వివాహాలను నిరోధించాలి అనే అంశాలపై వైద్య, ఆరోగ్య శాఖ ముద్రించిన అవగాహన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళికబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం అను నినాదంతో అవగాహన కార్యక్రమాలను జిల్లా అంతటా నిర్వహించాలని వైద్య, ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. బాల్య వివాహాలు, కౌమార గర్భాల నివారణకు కృషి చేయాలన్నారు. మహిళల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ, జిల్లా కుష్టు, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, సంచార వైద్యం నోడల్ అధికారి డాక్టర్ ఎం.రఘు, జిల్లా టీకాల అధికారి డాక్టర్ వై.నాగప్రసాదు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న మునిసిపల్ కార్మికులు

కర్నూలు(సెంట్రల్): మునిసిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కర్నూలు మునిసిపల్ కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమిళ్ల సుబ్బారాయుడు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఎన్నికల ముందు కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి రాగానే పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు తల్లికి వందనం సహా పలు సంక్షేమ పథకాలను నిలుపుదల చేయడం అన్యాయమన్నారు. కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని కోరారు. మునిసిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింజేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నాయకులు మద్దిలేటి, బి.వెంకటేష్, రామాంజనేయులు, నల్లన్న పాల్గొన్నారు.

చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దుతాం

కర్నూలు (టౌన్): నగరంలో అనేక మార్పులు చేపట్టి చెత్త రహితంగా తీర్చిదిద్దుతామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మాట్లాడుతూ.. చెత్త సేకరణ కోసం 91 ఎలక్ట్రికల్ వాహనాలను కర్నూలు కార్పొరేషన్‌కు కేటాయించామన్నారు. త్వరలో వాహనాలు వస్తాయన్నారు. జొహరాపురం, గార్గేయపురం డంప్ యార్డుల్లో లెగసీ, సాలిడ్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. జొహరాపురం డంప్ యార్డులో చెత్త నుంచి 15 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వేస్టేజ్‌తో వచ్చే ఏడాది 4 లక్షల టన్నుల ఎరువులను తయారు చేసి 50 మార్కెటింగ్ సంస్థల ద్వారా రైతులకు పంపిణీ చేస్తామన్నారు. కమిషనర్ పి.విశ్వనాథ్ పాల్గొన్నారు.